అనునిత్యం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 20 మార్చి 2023

ఖేలో ఇండియాలో గురుకుల విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినికి సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్) కామారెడ్డి లో బి. ఏ. తృతీయ సంవత్సరం చదువుతున్న బి.భూమిక అనే విద్యార్థిని హైదరాబాద్ లో జరుగుతున్న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో జావెలిన్ త్రో పోటీలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్టు ప్రిన్సిపాల్ వి. రాధిక తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ పి. మాణిక్యరేఖ, ఫిజికల్ డైరెక్టర్ హైమావతి, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినిని అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రాల వద్ద పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై తో పాటు పోలీసు సిబ్బంది పేకాట స్థావరం పై దాడి చేసి రూ. 7,070 నగదు స్వాధీనం చేసుకొని పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ అనిల్ తెలిపారు. పేకాట చట్ట వ్యతిరేక ఆట అని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎవరు నిర్వహించిన కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, నెహ్రూ నగర్‌లో గుడిసెలు వేసుకున్న ప్రజలు

వీరనారి.. మల్లు స్వరాజ్యం

- భావితరాలకు ఆదర్శం
- ఆమె ఆశయాల బాటలో నడుద్దాం : పలువురి నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మల్లు స్వరాజ్యం వీర నారి అని, ఆమె చరిత్ర భావి తరాలకు ఆదర్శమని పలువురు కొనియాడారు. ఆమె ఆశయ బాటలో నడవడమే ఆమెకు నివాళి అని అన్నారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి పురస్కరించుకొని ఎడపల్లి మండలం జానకంపేట్ శివారు నెహ్రూనగర్‌లో గుడిసె వాసులు, నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు, ఐద్వా జిల్లా కార్యదర్శి సబ్బాని లత మాట్లాడారు. 'మల్లు స్వరాజ్యం.. ఈ పేరు యావత్ తెలంగాణకే కాదు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో పరిచయం అక్కరలేని యోధురాలు. 500 ఎకరాలున్న భూస్వామ్య కుటుంబంలో పుట్టి, అడవుల్లో గిరిజన గుడిసెల్లో పెరిగింది. వెట్టి బతులకు వెతలు తీర్చేందుకు, భూమి కోసం భుక్తి కోసం పోరాడింది. దొర తనాన్ని సవాల్ చేసి 14 ఏండ్ల చిరుప్రాయంలోనే తెలంగాణ సంస్థానంలో దొరల భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా అన్న భీమిరెడ్డి నర్సింహ రెడ్డి చేయి పట్టుకొని అడవుల్లోకి వెళ్ళింది. స్వరాజ్యంకు చదువు కోవాలని ఉన్నా ఆనాటి పరిస్థితులు చదువుకోవాల్సిన వయస్సు లో దొరల భూస్వాముల ఆగడాలు సామాన్య జనం గోస... నైజాముని దురాగతాలు అన్నీ కళ్లారా చూసి చలించి చావైన బతుకైనా జనం కోసమే అనుకుందని' తెలిపారు.

ఆమె ప్రజా జీవితం ఆసాంతం కూడా సాదాసీదాగానే గడిపారని, ఎవ్వరికి కష్టం వచ్చినా కాలి నడకన వెళ్లి పోరాడారని, పోరాట కాలంలో పంచిన భూముల రికార్డులు పేదల నుంచి గుంజుకున్న వాటిని తిరిగి పేదలకు ఇప్పించే వరకూ పోరాడారని గుర్తుచేశారు. ఆమె ఆశయాల బాటలే నడవడమే ఆమెకు ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫరూక్, మనసూర్ మియా, జరీనా యాస్మిన్ రాజు లక్ష్మీ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్ ఎంపీకి సన్మానం


ఎంపీని సన్మానించిన సర్పంచ్, నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

నాందేడ్ ఎంపీ ప్రతాప్‌పటేల్ చిక్లికర్‌ను జుక్కల్ సర్పంచ్ బొంపెల్లి రాములు, బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలో సర్పంచ్‌ను ఎంపీ మర్యాదపూర్వకంగా కలవగా వారు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చిన్న ఎడ్గి శివాజీ పటేల్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెద్ద గుల్లా మాదారావ్ దేశాయి, నాందేడ్ జిల్లా బిజేపి పార్టీ అధ్యక్షుడు వెంకట్రావ్ పటేల్, గొడెగావ్ కర్, ప్రకాష్ పటేల్ బెమ్రేకర్, మాజీ జడ్పిటిసి సంతోష్ పటేల్, ఏర్గి సర్పంచ్ అవినాష్, ఆశోక్ సక్రె తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన ఆశలు

- అకాల వడగండ్ల వర్షానికి పంటలకు తీవ్ర నష్టం
- నేలకొరిగిన మొక్కజొన్న, వరి
- తడిచి ముద్దయిన శనగ
- పంటనష్టం అంచనా వేసి పరిహారం ఇప్పించాలని కోరుతున్న రైతులు

నవతెలంగాణ-విలేకరులబృందం

అకాల వడగండ్ల వాన రైతుల ఆశలను ముంచాయి. ఈదురుగాలుల కూడిన భారీ వర్షం కురవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మొక్కజొన్న, వరి నేలకొరగగా, విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన శనగ పంట తడిచి ముద్దయింది. వ్యవసాయాధి కారులు క్షేత్రస్థాయిలో పర్యటించిన నష్టపోయిన పసంటల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

బోధన్ : గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి సాలూర మండలంలోని ఖాజాపూర్ పరిసర గ్రామాలలో మొక్కజొన్న, సన్ ఫ్లవర్ పంటలు నేలకొరిగాయి ఖాజాపూర్, హున్స గ్రామ శివారులో సుమారు 100 ఎకరాల వరకు సన్ ఫ్లవర్, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయని రైతులు తెలిపారు ఈ అకాల వర్షాల వలన రైతులు కోసిన శనగ పంట సైతం తడిసిపోయిందని వాపోయారు. రెండు రోజులుగా కురిసిన అకాల వర్షానికి పంటలు నష్టపోయిన ఇంతవరకు అధికారులు సర్వే నిర్వహించలేదని రైతు చిద్రపు అశోక్ వాపోయారు. ఖాజాపూర్ శివారులో నాగనాథ్ పటేల్ సాగుచేసిన ఐదెకరాల సన్ ఫ్లవర్ పంట, ఏడు ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరిగిందని రైతు తెలిపారు. అధికారులు స్పందించి పంట నష్టం వివరాలు సేకరించి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని ఖాజాపూర్ రైతులు అశోక్ తెలిపారు.

నేలకొరిగిన మొక్కజొన్న.. వరి, గోదుమ పంటలకు తీవ్ర నష్టం

తాడ్వాయి : ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో పలు చోట్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తాడ్వాయి మండలంలోని కరడపల్లి గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి గోధుమ, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించాలని, రాష్ట్ర ప్రభుత్వం నష్టంపరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


తాడ్వాయి మండలం కరడ్‌పల్లిలో నేలవాలిన గోదుమ పంట

నేలకొరిగిన వరి.. పరిశీలించిన అధికారులు

ఎడపల్లి : మండలంలో శనివారం సాయంత్రం నుండి సుమారు రాత్రి తొమ్మిది గంటల వరకు వడగళ్ల వాన భారీగా కురవడమే కాకుండా రాళ్ల వర్షం కురిసింది. పొట్ట దశలో వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. కాగా మరికొంత మంది రైతులు పంటల నూర్పిడి చేస్తున్నారు. ఎడపల్లి మండల శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు తానా కలన్ కుర్నపల్లి గ్రామాలతో పాటు మిగతా గ్రామాలలో వరి పంటలను సందర్శించి పరిశీలించారు. సుమారు 100 ఎకరాలలోకి వరి పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారి పలు సలహాలు సూచనలను అందజేశారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అకాల వర్షంతో వరి పంటకు దెబ్బ

వర్ని : ఉమ్మడి వర్ని మండలంలోని శనివారం సాయంత్రం ఈదురు గాలులు, వర్షం భారీగా కురవడంతో చందూర్ మండలం గన్‌పూర్ గ్రామ లోని రైతు పంటలు నేలకొరిగినాయి. పొట్ట దశకు చేరుకొని చేతికి వచ్చిన పంట దెబ్బతిన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా రెండు రోజులపాటు భారీ వర్షాలు ఎదురుగాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలపడంతో ఆందోళన చెందుతున్నారు. ఘన్పూర్ గ్రామంలో సుమారు 200 ఎకరాల వరకు రైతులకు పంట నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ చేసి నష్టపరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాక్లూర్ : అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మానిక్‌బండార్ చెక్క దగ్గర అఖిల భారత రైతుకూలీ సంఘం అధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలకు వేలాది ఎకరాలలో రైతులు వేసిన పంటలకు భారీ నష్టం వాటిల్లిందనీ, మొక్కజొన్న పంట, పసుపు, వరి ఈదురు గాలులకు నేలమట్టమయిందన్నారు. వ్యవసాయ శాఖ వారు వెంటనే పంట నష్టం సర్వే చేసి నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరంకు రూ.25 వేల నుంచి రూ. 30 వెలు ఇవ్వాలని, పంట నష్ట పరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి పోతున్న, నాయకులు సాయిలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


ఖాజాపూర్ గ్రామ శివారులో నేలకొరిగిన సన్ ఫ్లవర్ పంట


ఎడపల్లిలో నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు


ఖాళీ బిందెలు, దబ్బాలు రోడ్డుపై అడ్డుగా పెట్టి మహిళల నిరసన

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి మండల కేంద్రంలో రెండవ వార్డులో తాగునీరు రాకపోవడంతో ఆదివారం మహిళలు రోడ్డుపై కాళీ బిందెలతో నిరసన తెలిపారు. గత మూడు రోజుల నుండి నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని, ఎవరు పట్టించుకోవటం లేదని, వెంటనే గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించి ప్రజలకు నీరు అందించాలని వారు కోరారు. జీపీ కార్యదర్శి కాంతిని నవతెలంగాణ వివరణ కోరగా.. మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో సమస్యలు ఉన్నాయని, సమస్యను, కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గ్రామపంచాయతీ నుండి అధికారులకు ప్రతిపాదనలు పంపామని, బోరు మోటారు మరమత్తులో ఉందని, మరమ్మతు చేయించి కాలనీ వాసులకు తాగునీరు అందిస్తామని తెలిపారు.

జనచైతన్య యాత్రను జయప్రదం చేయండి

- వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన సీపీఐ(ఎం) నాయకులు
- 24న నిజామాబాద్‌లో ప్రారంభమై కామారెడ్డి గుండా మెదక్‌కు..

నవతెలంగాణ-జుక్కల్

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు.. కార్పోరేట్ అనుకూల విధానాలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టనున్న జన చైతన్య యాత్రలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సురేశ్‌గొండ పిలుపునిచ్చారు. జుక్కల్ మండలం ఖండేబల్లూర్ గ్రామంలో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్‌గొండ మాట్లాడుతూ బిజేపీ మతోన్మాద కార్పోరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం, మతసామరస్యం, ప్రజాసామ్యం, సమాజిక న్యాయంకోసం పార్టీ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. దానిలో భాగంగా మార్చి 24న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభమై అదే రోజు కామారెడ్డి జిల్లా కేంద్రానికి వస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ప్రజాస్వామిక వాదులు, లౌకిక వాదులు, మేదావులు బాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నానారాయణ, యకులు అడేప్పా, శ్రీనివాస్, రామ్ నాయక్, మలుగొండ, మహిబుబ్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

పరీక్షలు కాదు.. ప్రభుత్వాన్నే రద్దు చేయాలి


- మంత్రి కేటీఆర్ పేషీ నుంచే లీకేజీ తతంగం
- నిరుద్యోగ నిరసన దీక్షలో రేవంత్‌రెడ్డి ఆరోపణ


మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-గాంధారి

టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రాల లీకేజీలతో పరీక్షలు రద్దు చేయాల్సి వచ్చిందని.. రద్దు చేయాల్సింది పరీక్షలను కాదని, ప్రభుత్వాని అని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ హత్ సే హత్ జోడో పాదయాత్రలో భాగంగా ఆదివారం కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో నిరుద్యోగ నిరసన దీక్ష చేపట్టారు. పేపర్ లీకేజి వ్యవహారంతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అతి తెలివిగా తప్పించుకునే ప్రయత్నం చేసినా, తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఈ విషయంలో కేటీఆర్‌ను బర్తరఫ్ చేయడమే కాకుండా, చంచల్ గూడా జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో అరెస్ట్ చేసిన వారిని కస్టడీలోకి తీసుకోని ఎందుకు ఇప్పటి వరకు వివరాలు సేకరించలేదని ప్రశ్నించారు. శనివారం కేటీఆర్ ప్రెస్ మీట్ తర్వాతనే వారిని విచారణ నిమిత్తం కస్టడీకి తీసుకున్నారని ఆరోపించారు. జైలులో ఉన్న నిందితులను బెదిరించి ఎన్‌కౌంటర్ చేస్తామని లొంగదిసుకున్నారని అన్నారు. ఎవరి పేర్లు బయటకు రాకుండా చూసిన తర్వాత, కేటీఆర్ ప్రెస్ మీట్ పూర్తి కాగానే వారిని కస్టడీలో తీసుకున్నారని అన్నారు.

వివరాలు మెయిన్‌లో..


పాదయాత్రలో అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి

నిర్మించారు.. వదిలేశారు

- నిరుపయోగంగా కూరగాయల సముదాయాలు
- రెండేండ్లుగా అతీగతీలేదు..
- రోడ్లపైనే కూరగాయల అమ్మకాలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



వర్తకులకు కేటాయించకపోవడంతో వృథాగా ఉన్న కూరగాయల మార్కెట్ సముదాయం

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నగరంలో నిర్మించిన వీధివ్యాపారుల వర్తక సముదాయాలు నిరుపయోగంగా మారాయి. నిర్మాణం పూర్తయి సంవత్సరం పూర్తయినా లబ్ధిదారులకు అందివ్వడం లేదు. ఫలితంగా ఆ నిర్మాణాలు బిచ్చగాళ్లకు, పోరంబోకులకు, మందుబాబులకు అడ్డాలుగా మారాయి. మరోవైపు రోడ్లపైనే కూరగాయాలు విక్రయిస్తూ వీధి విక్రయదారులు ఇబ్బందులుపడుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల చేతిలో ప్రతిసారి అవమానాలు, ఛీత్కారా లు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై కూరగాయాలు అమ్ముతు న్నారనే కారణంతో కొన్ని సార్లు మున్సిపల్ సిబ్బందే కూరగా యాలను తమ చెత్త ట్రాక్టర్లలో నింపి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అమ్మ పెట్టదూ అడుక్కో నీయ్యదు అన్నట్టు నిర్మించిన సముదాయలు ఇవ్వడం లేదు. రోడ్లపై అమ్మనివ్వడం లేదు. ఇక రోడ్లపై అమ్మితే అటు ట్రాఫిక్ కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అంగడిబజార్‌తో పాటు గాంధీగంజ్, ఆర్ఆర్ చౌరస్తా వద్ద రోడ్లపై కూరగాయాలు అమ్మనీయకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. అందులో భాగంగా అంగడిబజార్‌లో గతంలోనే రైతుబజారు నిర్మించారు. కానీ వీటిలో పూర్తిస్థాయిలో అమ్మకాలు సాగడం లేదు. ఇక కోవిడ్ తరువాత విక్రయాలు రోడ్లపై జోరుగా సాగుతుం డటంతో ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ వెనుక భాగంలో అలాగే హమాల్‌వాడీలో రెండు వీధి వ్యాపారుల వర్తక సముదా యాలు నిర్మించారు. సమీప ప్రాంతాల్లో కూరగాయాల విక్రేతలు ఈ సముదా యాల్లో కూరగాయాలు అమ్మితే ట్రాఫిక్ ఇబ్బందులు తొలుగుతాయని నిర్మించారు. ఒక్కో దానికి పది లక్షలకు పైగా ఖర్చు చేసి నిర్మించారు. ఇంత వరకు బాగానే ఉన్నా నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాది కావస్తోంది. కానీ ఇప్పటి వరకు కూరగాయాల విక్రేతలకు ఇవ్వలేదు. ఫలితంగా నేటికీ రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. ఉదాహరణకు ఆర్ఆర్ చౌరస్తా లాంటి రద్దీ ప్రాంతంలో రెండు వైపులా ప్రతిరోజూ కూరగాయాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. వీరందరికీ మల్టీప్లెక్స్ వెనుక నిర్మించిన సముదాయాల్లోకి తరలిస్తే.. ఇటు ట్రాఫిక్ కష్టాలు తొలుగుతాయి. మరోవైపు కొనుగోలుదారుల సైతం ఒకే ప్రాంతంలో అన్ని కొనుగోలు చేసే ఆస్కారం ఉంటుంది. పైగా ఇక్కడ రోడ్లు సైతం విశాలంగా ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య కూడా ఉండబోదు. ఈ మేరకు విక్రయదారులకు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించి పరిష్కారం చూపాల్సిన మున్సిపల్ పాలకవర్గం, అధికారులు.. ఆ ఊసే ఎత్తడం లేదు. అసలు వీటిని మున్సిపల్ కార్పొరేషన్ నిర్మించిందన్న సోయి కూడా లేకుండా పోయింది. అసలు ఎందుకు నిర్మించారు? ఎందుకు వృధా ఉంచారు? అన్నవాటికి అధికారుల వద్ద సమాధానం లేకుండా పోయింది. ఇప్పటికైనా లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ సముదాయాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

యోగ, ధ్యానంపై అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలో యోగ, ధ్యానంపై ఆదివారం మెగా ర్యాలీ నిర్వహించారు. యోగ, ధ్యానం పై నర్సారెడ్డి , చిన్న ముత్తెన్న వరంగల్ మాస్టారు రహీం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పిఎస్-ఎస్ఎం అధ్యక్షులు నల్లా గంగారెడ్డి , నవనాథపురం కమిటీ సభ్యులు అడ్వకేట్ సాయి కృష్ణరెడ్డి , తిరుమల గంగారాంరెడ్డి, కూనింటి శేఖర్ రెడ్డి, అమరవాజి శ్రీనివాస్, నారాయణ, రాజారాం. ఆనంద్, సుఖాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ముప్కాల్



మండల కేంద్రంలోని మైనారిటీ మజిత్ రెండో పంథా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘ పెద్దలు తెలిపారు. నూతన అధ్యక్షులుగా సయ్యద్ ఉమర్, ఉపాధ్యక్షులుగా షేక్ రహీముద్దీన్, సెక్రటరీగా మహమ్మద్ ఇక్బాల్, కోశాధికారిగా అబ్దుల్ అజీజ్, సలహాదారులుగా అబ్దుల్ రఫీ, సభ్యులుగా బషీర్, యూనుస్, మోయిన్, హైమత్, షేక్ హైమద్, నసీరుద్దీన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అభివృద్ధికి పాటు పడుతామని వారన్నారు. కార్యక్రమంలో ముస్లిం సంఘ సభ్యులు యాకూబ్, జావేద్, సమీర్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌సీఎస్‌సీ పేపల్ లీకేజీకి

సీఎం కేసీఆర్, కేటీఆర్ బాధ్యత వహించాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- సీఎం, కేటీఆర్ రాజీనామా చేయాలి
- దిష్టిబొమ్మలు దహనం



వర్నిలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



ఏర్గట్లలో సీఎం, కేటీఆర్ దిష్టిబొమ్మలు హనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మండలకేంద్రాల్లో కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను ఆదివారం దహనం చేశారు. టీఎస్ పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ విషయంలో తెలంగాణ రాష్ట ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ బాధ్యత వహిస్తూ తక్షణమే తమ తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ-విలేకరులు

ఏర్గట్ల:సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దగ్దం చేసినట్లు మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అనంతరం అంబెడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివన్నోళ్ళ శివకుమార్,బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, నాయకులు గడ్డం జీవన్, ముస్కు మోహన్ రెడ్డి, ఇంద్రసేన రెడ్డి, రొక్కెడ సంజీవ్, జింక అన్వేష్, మెరుగు గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్:పేపర్ లీకేజీలో కేటీఆర్ హస్తం ఉందంటూ, తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎన్నో ఏండ్ల తరువాత నోటిఫికేషన్ వేసి ప్రిపేర్ అయిన విద్యార్థుల భవిష్యత్తు నాశనం అయ్యేలా పేపర్ లీకేజీకి పాల్పడడం ప్రభుత్వ వైఫల్యం అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరసయ్య, మహిపాల్, రాజశేఖర్, రాజకుమార్, రంజిత్, దేవేందర్, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు

వర్ని:మండలకేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మను మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం దగ్ధం చేసినారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ సురేష్ బాబా మాట్లాడుతూ గ్రూప్స్ పేపర్ లీకేజీ వ్యవహారంలో దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిసిసి డెలిగేట్, రాష్ట్ర మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాసరావు, డీసీసీ కార్యదర్శి సురేష్ బాబా,డీసీసీ డెలిగేట్ గంగ ప్రసాద్, కిసాన్ కేత్ అధ్యక్షులు గంగప్ప, జాకోర పిఎసిఎస్ డైరెక్టర్ సాయిలు,వర్ని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మొయినుద్దీన్, మాజీ ఎంపిటిసి హరి, ప్రకాష్ బాబా,సుద్దులం మాజీ సర్పంచ్ పీరియా నాయక్, శనిగరం కిషన్, సుధాకర్, వెంకట్ గౌడ్, దయానంద్, గోవురీ శ్రీనివాస్, బషీర్ రాజు, పిట్ల సాయిలు, శంషు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండల కేంద్రంలోని 63వ నెంబర్ జాతీయ రహదారిపై ఉప్లూర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం టీఎస్పీఎస్సీలో పేపర్ లీకేజీ పై తక్షణమే సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తక్కురి దేవేందర్, కమ్మర్‌పల్లి టౌన్ ప్రెసిడెంట్ నిమ్మ రాజేంద్రప్రసాద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోనగిరి భాస్కర్, నాయకులు బుచ్చి మల్లయ్య, చింతకుంట శ్రీనివాస్, కొమ్ముల రవీందర్, ఉట్నూరు ప్రదీప్, వేములవాడ జగదీష్, ఎడ్ల దీపక్ సాయి, రిత్విక్, సుంకేట శ్రీనివాస్, సల్లూరి గణేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి:మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈసందర్బంగా మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్ మాట్లాడుతూ..టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష ప్రశ్నాపత్రాల లీక్ ఘటనలో తనకు సంబంధం లేదని మంత్రి కేటీఆర్ అనడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో చెలిమెల నర్సయ్య, కుమ్మరి గంగారాజ్యం, ఇర్ఫాన్, అరుగుల బాల్ రెడ్డి, అనిల్, పాల్గొన్నారు.



కంఠేశ్వర్: నిజామాబాద్ నగరంలో...

కంఠేశ్వర్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర అధ్యక్షులు కేశ వేణు, అర్బన్ ఇన్చార్జ్ తాహెర్ బిన్ హందాన్, అంత రెడ్డి రాజిరెడ్డి, నీరెడ్డి భాగ్య, కేశ మహేష్, రేవతి, విజయలక్ష్మి, అయూబ్, నరేందర్ గౌడ్, శోభన్, రత్నాకర్ పాల్గొన్నారు.



ధర్పల్లిలో..

ముప్కాల్ : మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో ముప్కాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగంపేట్ గంగాధర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి జైడి చందా రవిరెడ్డి, పోల ప్రవీణ్, మగ్గిడి ముత్యంరెడ్డి, బద్దం సాగర్ రెడ్డి, రాజ్ కుమార్, అబ్రార్ పాల్గొన్నారు..



మోర్తాడ్‌లో..



కమ్మర్‌పల్లిలో..



ముప్కాల్‌లో..

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయండి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న రఘురాం

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నగరంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని దాంతోపాటు గ్రూప్-1 పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయాలని అన్నారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, చనిపోయిన నిరుద్యోగి కుటుంబానికి ఉద్యోగం, కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా సమితి సభ్యులు సుభొద్, నగర నాయకులు నవీన్, సుమేద్, పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమా..?

- టీవీయూవీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న రమావత్‌లాల్‌సింగ్

విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని రమావత్ లాల్ సింగ్ అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ మాట్లాడుతూ టీఎస్పీఎస్సీ ద్వారా నిర్వహించిన పరీక్షల్లో పారదర్శకత లోపించిందన్నారు. అధికారుల నిర్లక్ష్యంవల్లే పరీక్ష ప్రశ్న పత్రాలు లీకేజ్ అవుతుందన్నారు. టిఎస్పిఎస్సి ఘటనపై పూర్తి విచారణ జరిపించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజ్ నిందితుడు ప్రవీణ్‌ను సిట్టింగ్ జడ్జితో విచారించాలని, అప్పుడే వాస్తవాలు బహిర్గతమవుతాయని అన్నారు. ఇందులో సంబంధం ఉన్న ఎంతటి అధికారులనైన కఠినంగా శిక్షించాలని అన్నారు. ప్రభుత్వం మాటలు కేవలం నోటిఫికేషన్ కి తప్ప అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. సమావేశంలో టీవీయూవీ జిల్లా కన్వీనర్ అజయ్, భాస్కర్, నవిన్ పాల్గొన్నారు.

విజ్ఞాన విహారయాత్రకు పచ్చల నడుకుడ విద్యార్థులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పచ్చల నడుకుడ పాఠశాల ఆధ్వర్యంలో విహారయాత్ర లో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయాన్ని సందర్శించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వివిధ శాఖల పనితీరును పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ , ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థులను బాసర సరస్వతి ఆలయం, ట్రిపుల్ ఐటీ కళాశాలను చూపించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ విజ్ఞాన విహార యాత్ర విద్యార్థులకు మంచి స్ఫూర్తిని అందిస్తుందని ప్రధానోపాధ్యాయులు సురేష్ వివరించారు. ఈ యాత్రలో ఉపాధ్యాయులు గంగా నర్సయ్య, లింబగిరి స్వామి, షేక్ మదర్, రవీందర్ గౌడ్, రాజా, తదితరులు పాల్గొన్నారు

బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బాల్య మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి వారికి అండగా ఉంటామంటూ స్నేహితులు గా తమ ఔన్నత్యాన్ని చాటారు. మోపాల్ మండలం తాడెం గ్రామంలో జలంధర్ (31) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జలంధర్ చనిపో యాడని తెలుసుకొని విశ్వభారతి విద్యాలయంలో ఆయనతోపాటు పదోతరగతి చదువుకున్న మిత్రులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. జలంధర్ కు ఆడపిల్లలు ఉన్నారు. మిత్రుడి కుటుంబానికి తోచినంత సహాయం చేయాలని వారందరూ అనుకున్నారు. శనివారం ఆయన భార్య జ్యోతి, వారి కుటుంబానికి 50వేల రూపా యలు అందజేశారు. అంతే కాకుండా ఎలాంటి కష్టం వచ్చినా ఎప్పుడు మీ వెన్నంటే ఉంటామంటూ వారికి మనోధై ర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో సతీష్ గౌడ్, రాం మోహన్, నరేష్, రాజేశ్వర్, రాజు కుమార్, సతీష్ కుమార్, రమేష్, ప్రసాద్, నవీన్, శివ, సతీష్ రెడ్డి, యోగి, రంజిత్, రూప, హేమ, అలేఖ్య భరద్వాజ్, మౌనిక, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

వేపకు ఎండు తెగుళ్లు

నవతెలంగాణ-నవీపేట్



తెగులు సోకి ఎండిన వేపచెట్టు

సర్వరోగ నివారిణి వేప చెట్టుకు వేసవిలో ఎండు తెగుళ్లు సోకి పూర్తిగా వాడిపోతున్నాయి. పర్యావరణ హితమైన చెట్టుకు ఇలా ఎండు తెగుళ్ల సోకడంతో ప్రజలు ఆందోళనతోపాటు అనుమానాలకు గురవు తున్నారు. ఈ ఎండు తెగుళ్ల ముఖ్యంగా దక్షిణ తెలంగాణ లోని జిల్లాల్లో రెండు, మూడు సంవత్సరాలుగా వ్యాప్తి చెందినట్లు తెలుస్తోంది. దీంతో పర్యావరణ శాస్త్రవేత్తలు వేపచెట్టు లేత ఆకులు, కొమ్మలు, బెరడు మట్టి నమూనాలను సేకరించి పరిశోధించారు. ఇది టీ- మస్కిటోబగ్ పురుగు లేత కొమ్మల మీద రంధ్రాలు చేయడం తర్వాత శిలీంద్రాలు ఆ రంధ్రాల్లో పాగా వేసి రసాన్ని పీల్చడంతో ఆకులతో పాటు చెట్టు పూర్తిగా ఎండిపోతుంది. దీన్ని మాచట రోగం లేదా డై బ్యాక్ వ్యాధిగా అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. దీని నివారణకు లీటర్ నీటికి థయోమిథాక్సమ్ లేదా ఎసిటామీప్రిడ్ 0.2 గ్రా మరియు కార్బన్డిజంం మాంకోజెట్-2.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి చెట్టుపై పిచికారి చేయాలి. లేదా భావిస్టిన్ ఒక గ్రాము మందు 8 లీటర్లలో కలిపి పిచికారి లేదా ఇంజక్షన్ ద్వారా సైతం వేప చెట్టుకు ఇస్తే వ్యాధి నివారించవచ్చని వ్యవసాయ అధికారి సురేష్ గౌడ్ తెలిపారు. తగు జాగ్రత్తలతో పిచికారి చేయాలని సూచిస్తున్నారు. సర్వరోగ నివారిణితో పాటు వేసవిలో చల్లని నీడనిస్తూ వేసవి తాపాన్ని తగ్గించే వేపచెట్టు ఇలా ఎండు తెగుళ్లతో పూర్తిగా వాడిపోతుండడంతో ప్రకృతి ప్రేమికులు ఆశ్చర్యంతో పాటు ఆందోళనకు గురవుతున్నారు. కాబట్టి ప్రభుత్వ యంత్రాంగం స్పందించి సర్వరోగ నివారణకి రోగ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



తెగులు సోకిన చెట్టును చూపుతున్న రైతు ఓం లాల్

మెడికల్ క్యాంపునకు విశేష ఆదరణ

ఉచితంగా మందులు అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నాందేవ్ వాడలోని ట్రస్టు భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంపునకు విశేష ఆదరణ లభించిందని ట్రస్ట్ కార్యదర్శి కే. రామ్మోహరావు తెలిపారు. జ్వరం, దగ్గు, శ్వాసకోశ వ్యాధులు, దమ్ము, బీపీ, షుగర్, తదితర బాధితులకు ఉచితంగా చికిత్స చేశారు. ఈ హెల్త్ క్యాంపులో ప్రముఖ డాక్టర్లు ఊపిరితిత్తుల వ్యాధి నిపుణుడు డాక్టర్ బి.రాజేశ్వర్, ప్రముఖ ఫిజీషియన్ వి. భరత్ కుమార్, ప్రముఖ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మి ఈ శిబిరంలో వైద్యసేవలు అందించారు. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉచితంగా మందులను సరఫరా చేశారు. మెడికల్ రిప్స్ యూనియన్ ప్రతి నిధులు కూడా క్యాంపులో పాల్గొని ఉచితంగా మందు లను సరఫరా చేశారు. ఈసీజీ, బ్లడ్ టెస్ట్‌లు, బాధితులకు ఉచి తంగా చేశారు. ఈ హెల్త్ క్యాంపులో ట్రస్ట్ సభ్యులు ఈవీఎల్ నారాయణ, లావు వీరయ్య, వి ప్రసాద్ రావు, నర్సింలు, రమేష్ బాబు, ఆల్ పెన్షనర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్ రావు, భోజరావు, సాయిలు, మహేష్ కులకర్ణి, శ్రీనివాస్, విఘ్నేష్, నూర్జహాన్, సబ్బని లత, అనిత, తదితరులు పాల్గొని విజయ వంతం చేశారు. ఈసందర్బంగా క్యాంపులో వైద్యసేవలు అందించిన డాక్టర్లను సన్మానించారు.



క్యాంపునకు వచ్చిన ప్రజలు



సేవలందించిన వైద్యులను సన్మానించిన రిటైర్డ్ ఉద్యోగులు



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

చెడు అలవాట్లకు బానిసలు కావద్దు

జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-సిరికొండ

యువకులు చెడు అలవాట్లుకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ధర్పల్లి జడ్పిటిసి సభ్యులు, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ అన్నారు. మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన శివాజీ, యువజన సంఘం సభ్యులు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం బాజిరెడ్డి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పులమాలతో సత్కరించారు. అనంతరం గ్రామంలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని విన్నవించడంతో ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ప్రతి యువకుడు ఎంచుకున్న లక్ష్యసాధనకు కృషిచేసి ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల్ యూత్ అధ్యక్షుడు చిగురు శ్రీనివాస్, సర్పంచ్ తిరుపతి, ఉపసర్పంచ్ సంతోష్, యువజన సంఘం సభ్యులు సురేష్, రమేష్, తిరుపతి, రాజేందర్, వినోద్, అన్వేష్, సుధాకర్, ప్రకాష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



జగన్‌ను సన్మానిస్తున్న యువకులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలో వంతెనలు, రోడ్ల నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. మండల కేంద్రంలోని బద్దంవాడ నుండి కమ్మర్‌పల్లికి వెళ్లే రహదారి మొండిబాగుపై వంతెన నిర్మాణానికి రెండు కోట్ల 20లక్షలుతోబాటు రోడ్డు నిర్మాణానికి కోటీ 60 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మండల కేంద్రం నుంచి వడ్యాట్ వెళ్లే రహదారి మత్తడిపై చెడిపోయిన వంతెన నిర్మాణానికి 15 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు ఈ నిధులతో చెడిపోయిన రోడ్లు వంతెన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధరణి ఆనంద్, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పిటిసి రవి, పార్టీ మండల అధ్యక్షుడు ఏలియా రాజ్ పాల్, జెసి గంగారెడ్డి, కేసీ రాజేశ్వర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
సోమవారం 20 మార్చి 2023

ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-జుక్కల్

బాన్సువాడకు చెందిన ఓ ప్రయివేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పేదలకు సేవా చేయాలనే లక్ష్యంతో బీపీ, షుగర్ వైద్య పరిక్షలు ఉచితంగా చేయడమే కాక, మందులను అందజేసినట్టు వైద్యులు తెలిపారు. మారుమూల ప్రాంతం జుక్కల్ మండలంలోని గ్రామ గ్రామాన వైద్యం అందించడమే తమ లక్ష్యమని, రాబోయే రోజులలో సేవలను సరిహద్దు గ్రామాలలో విస్తృతం చేస్తామని ప్రయివేట్ ఆసుపత్రి వర్గాల వైద్యబృందం సబ్యులు, టెక్నిషియన్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్ఎంపి వైద్యుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకొద్దాం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

టీడీపీకి పూర్వ వైభవం తెచ్చే విధంగా అందరం సమిష్టిగా కృషి చేద్దామని దేగాం యాధాగౌడ్ అన్నారు. నిజామాబాద్ పార్లమెంటు పరిధి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం రాష్ట్ర నాయకులు కోయేడీ నర్సింలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగమ్ యాదగౌడ్ హాజరై మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గంలో పార్టీ వీడి స్తబ్దతగా ఉన్న నాయకులు ధైర్యంగా ముందడుగు వేసి పార్టీ బలోపేతం కొరకు ముందుకు రావాలన్నారు,

నీళ్లు, నిధులు, నియామకాల్లేవ్

- కేసీఆర్ సొంత ప్రయోజనాలకు వాటి దుర్వినియోగం
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం
- టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి హామీ
- పార్టీకోసం కష్టపడేవారికే టికెట్లు ఉంటాయని పునరుద్ఘాటన



పాదయాత్రలో రేవంత్‌రెడ్డి వెంట నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



నిరుద్యోగ దీక్షలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-గాంధారి

'తెలంగాణ ఉద్యమాన్ని నడిపింది విద్యార్థులు. 1200 మంది విద్యార్థులు, నిరుద్యోగులు ఆత్మబలిదానం చేసుకుంటే తెలంగాణలో ఇక మరణాలు ఉండకూడదని సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది. నీళ్ల, నిధులు, నియామకాలు కోసం ఉద్యమం జరిగిందని, తెలంగాణ ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు కావొస్తున్నా రాష్ట్ర ప్రజలకు నీళ్ల, నిధులు, నియామకాలు అందడం లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన తనయుడు కేటీఆర్ సొంత ప్రయోజనాల కోసం నీళ్ల నిధులు నియామకాలను దుర్వినియోగం చేస్తున్నారని' టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో పాదయాత్ర శనివారం రాత్రి గాంధారి మండలంలో గుడిమెట్ గుండా ప్రవేశించింది. గ్రామంలో రాత్రి బస్సు చేసిన రేవంత్‌రెడ్డి ఉదయం అక్కడి నుండి గాంధారి మండల కేంద్రంలోని నిరుద్యోగ నిరసన దీక్ష శిబిరానికి చేరుకున్నారు. నిరుద్యోగ నిరసన దీక్ష శిబిరంలో ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం 6:00 వరకు నిరాహార దీక్ష కొనసాగించారు. 6 గంటల సమయంలో కాంగ్రెస్ నేత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గ్రూప్ వన్ పరీక్షలు రద్దు చేయడంతో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ముఖ్యమంత్రి నిరుద్యోగులకు భరోసా ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం మానవత్వం లేని మృగాల మాదిరి ప్రవర్తిస్తుందని దుయ్యబట్టారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేకపోయారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన తనయుడు కేటీఆర్ వారి సొంతమనుసుల కోసమే వారి కుటుంబ సభ్యుల కోసం పరీక్ష ప్రశ్న పత్రం లీక్ చేస్తున్నారని ఆరోపించారు. పరీక్షలను రద్దు చేయడం కాదని, ప్రజలే ప్రభుత్వాన్ని రద్దు చేస్తారని అన్నారు.

2016 నుండి ఇప్పటి వరకు జరిగిన గ్రూప్ పరీక్షలు, మిగతా పరీక్షలపై విచారణ చేయాలనీ డిమాండ్ చేశారు. ఇంత తీవ్రమైన సమస్యపై సీఎం కెసిఆర్ స్పందించి నిరుద్యోగులకు భరోసా ఇవ్వలేదని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు రాసి ఉద్యోగం పొందిన వారి కొంత మంది వివరాలు వెల్లడించారు. మంత్రి పేషీలో తెలియకుండా ఇదంతా జరిగిందా అని ప్రశ్నించారు. సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అప్పుడు ఎమ్మెల్యేల కొనుగోలు, ఇప్పుడు ప్రశ్నపత్రాల కొనుగోలు జరిగిందని అన్నారు. అక్కడ కెసిఆర్, ఇక్కడ కేటీఆర్ సూత్రదారులు అని అన్నారు. పేపర్ లీకేజి వ్యవహారంపై హైకోర్టులో వాదనలు వినిపిస్తామని, అలాగే 21వ తేదీన దీనిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని భరోసా ఇచ్చారు. 30 లక్షలమంది నిరుద్యోగులకు పిలుపునిస్తున్నా అని కెసిఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. తండ్రి కొడుకులను జైలుకు పంపించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. నిరుద్యోగుల కోసం నిరంతరం ముందుండి కాంగ్రెస్ పోరాటం చేస్తుందని ప్రజలు మరో 8 నెలలు ఓపిక పడితే రాక్షస ప్రభుత్వాన్ని అంతమొందించి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొస్తామని అన్నారు. 2024 లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అక్రమాలపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే సంవత్సరంలోపు 2,00,000 ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలుపుకొని 2024 ఎన్నికల్లో టికెట్లు కేటాయిస్తామని కష్టపడే వారికే టికెట్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. నిరుద్యోగ నిరసన దీక్ష శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రజలకు కార్యకర్తలకు నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో షబ్బీర్ అలీ, మల్లు రవి, సుదర్శన్ రెడ్డి , బలరాం నాయక్, ఎమ్మెల్యే సీతక్క, జీవన్ రెడ్డి ,మహేష్ కుమార్ గౌడ్, భూపతిరెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కర్ ,గంగారం, రాములు నాయక్ వడ్డేపల్లి భాష్ రెడ్డి, మదన్ మోహన్, గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూర్పు రాజు, కేంద్ర రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రులు మాజీ ఎంపీలు మాజీ ఎమ్మెల్యేలు నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐకమత్యంతో అభివృద్ధి.. అభినందనీయం



రిబ్బన్‌కట్ చేసి ప్రారంభోత్సవం చేస్తున్న జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-ధర్పల్లి

మారు మూల పంచాయతీలో కేవలం 28 కుటుంబాలు నివసించే తండాలో ఇక్కడి ప్రజలు చేసుకుంటున్న అభివృద్ధి కేవలం వారి ఐక్య మత్యంతోనే సాధ్యపడుతుందని జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌మోహన్ అన్నారు. ఇంటికి కొన్ని డబ్బులు పోగు చేసుకొని ఆలయ నిర్మాణానికి పూనుకోవడం హర్షించదగ్గ విషయమ్నారు. మండలంలోని డీబీతండా పంచాయతీ పరిధిలోని చంతరల్‌తండాలో గిరిజనులు నూతనంగా నిర్మించిన జగదాంబ ఆలయం ప్రారంభోత్సవంతో పాటు జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్, రామారావు మహారాజ్‌ల విగ్రహ ప్రతిష్టాపనోత్సవంలో ఆదివారం ముఖ్యఅథితిగా హాజరై ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామారావు మహారాజ్ సందేశం చాలా గొప్పదని అన్నారు. గ్రామాన్ని సర్పంచ్, ఎంపీటీసీ ఇద్దరు కలిసి అభివృద్ధి చేస్తున్నారని కితాబు ఇచ్చారు. ఆలయానికి ఎండోమెంట్ ద్వారా రూరల్ ఎమ్మెల్యే రూ.10 లక్షలు అందజేసినట్టు తెలిపారు. వీటితో పాటు ఆలయం ముందు తీజ్ పండగ ఉత్సవ పందికి రూ.1.50 లక్షలు, నీటి తొట్టెలు 2లక్షలు, బోరు మోటార్లు మరో లక్షా అందించినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, హన్మంత్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాజ్ పాల్ రెడ్డి, తీర్మల్, డిబి తండ ఎంపీటీసీ గుగులో స్వామి,పెంద గంగాధర్,నాయకులు ధారవత్ గోపాల్ నాయక్,డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, శంకర్ నాయక్, లాల్ సింగ్, ప్రతాప్ గౌడ్, ఎఫ్ఏ రవి,భుక్యాపీర్యపంతులు తండ ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

నవతెలంగాణ-రామారెడ్డి

రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందని, జర్నలిస్టుల హక్కులను హరిస్తూ, మీడియా సంస్థల కార్యాలయాలపై దాడి చేసే సాంస్కృతి మంచిది కాదని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి పేర్కొన్నారు. క్యూ న్యూస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలతో పాటు, మీడియా ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలిపే వారధిగా పని చేస్తున్న మీడియాలపై దాడి చేయడం మంచి సాంస్కృతి కాదని, బి ఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజల హక్కులను కాల రాస్తుందని మండిపడ్డారు. సరియైన సమయంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌వి విద్యార్థి విభాగం

జిల్లా అధ్యక్షులుగా గైక్వాడ్ విలాస్



నియామక పత్రం అందుకుంటున్న విలాస్

నవతెలంగాణ-మద్నూర్

కామారెడ్డి జిల్లా బీఆర్ఎస్‌వి విద్యార్థి విభాగం అధ్యక్షులుగా డోంగ్లి మండలం పెద్ద టాక్లి గ్రామానికి చెందిన గైక్వాడ్ విలాస్ ఎంపికైనట్టు నాయకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్‌వి విద్యార్థి విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గైని సంపత్ నియామక ఉత్తర్వులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను శక్తివంచన లేకుండా నెరవేరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో నితిన్, వినయ్, సాయ భాస్కర్, దిలీప్ కుమార్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన ఆర్మూర్ పట్టణ శివారులో శనివారం చోటుచేసుకుంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు వివరాల ప్రకారం.. పట్టణం నుండి నిజామాబాద్ వెళ్లే రోడ్డులోని ఆలూరు బైపాస్ నుండి ఆలూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం.. మూల మలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటన డొంకేశ్వర మండలానికి చెందిన శ్రావణ్‌కుమార్ (31) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తల్లి వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్హెచ్ఓ తెలిపారు.

భగీరథకు లీకేజీలు

- బురదమయమౌతున్న రోడ్డు



రోడ్డుపై పారుతున్న నీరు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని బోర్గం (కే) గ్రామం ప్రస్తుతం నిజామాబాద్ రెండవ డివిజన్ పరిధిలో ఉంది. మిషన్ భగీరథ లీకేజీలు బోర్గంలో ఎపుడు ఏదో ఒకచోట అవుతూనే ఉన్నాయి. స్థానికులు లీకేజీలపై అధికారులకు, మున్సిపల్ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసిన ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని అంటున్నారు. చివరకు మున్సిపల్ కమిషనర్‌కు కూడా వాట్సాప్ ద్వారా ఫోటోలు పంపించారు. మున్సిపల్ కమిషనర్ ఏఈని పంపుతానని చెప్పినా ఇంత వరకు ఏ ఒక్క అధికారి రాలేదని అంటున్నారు. రోడ్డు కొత్తగా వేయడంతో రెండు ఫీట్ల ఎత్తు పెరగడం వల్ల లీకేజీల నీరు మురికి కాలువ్లకి పోకుండా వాకిట్లోనే నిలుస్తున్నాయి. దీనివల్ల విపరీతమైన దోమలు, నడవడానికి ఇబ్బంది అయితుందనీ గ్రామ స్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అర్బన్ ఎమ్మెల్యేకు తృటిలో తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న ఎమ్మెల్యే కారు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తకు తృటిలో ప్రమాదం తప్పింది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా.. కామారెడ్డి సిరిసిల్లా రోడ్డు వద్ద ఓ కారు ఎమ్మెల్యే కారును ఢీకొంది. దీంతో కారు పాక్షికంగా దెబ్బతినగా.. ఎమ్మెల్యే ప్రమాదం నుంచి బయట పడ్డాడు. వేరే కారులో హైదరాబాద్ వెళ్లిపోయారు. ఆయన కాన్వయ్ మధ్యలోకి వేరే కారు రావడంతో ప్రమాదం నెలకొన్నట్టు పోలీసులు తెలిపారు.

సంపులోపడి బాలుడు మృతి



మృతి చెందిన యశ్

నవతెలంగాణ-నందిపేట్

అప్పటి వరకు బుడిబుడి అడుగులతో ఇళ్లంతా సందడి చేసిన చిన్నారి.. సంపులో పడి మృతిచెందడతో ఆ కుటుంబీకులు రోదనలు మిన్నంటాయి. ప్రమాదవశాత్తు ఇంటి ఎదుట ఉన్న సంపులో పడి ఏడాదిన్నర బాబు మృతి చెందాడు. నందిపేట్ మండల కేంద్రంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సుభాష్ నగర్ మంతెనగల్లిలో నివాసముంటున్న నడుకుడా శ్రీనివాస్-మమత దంపతుల కొడుకు నడుకుడా యశ్(ఏడాదిన్నర) ఇంటిముందు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడి మృతిచెందాడు. నిరుపేద కుటుంబమైన శ్రీనివాస్ తన కుటుంబాన్ని పోషించేందుకు గల్ఫ్ బాట పట్టి కాయకష్టం చేసి భార్య పిల్లలను పోషించుకుంటున్నాడు. ఇంటి ముందు ఉన్న నల్ల కుండీ రూపంలో మృత్యువు చిన్నారి ప్రాణాలను బలి తీసుకోవడంతో కుటుంబం దుక్కసాగరంలో మునిగిపోయింది. శ్రీనివాస్ కుటుంబం తన తల్లి, భార్య ఇద్దరు కుమారులు మంతెన గల్లీలో అద్దె ఇంట్లో ఉండి జీవనం సాగిస్తున్నారు. రెక్కాడితే డొక్కాడని పరిస్థితి వారిది. శ్రీనివాస్ భార్య మమత బీడీ కార్మికులు. రోజులాగే తాను చేసిన బీడీలను కంపెనీలో ఇచ్చేందుకు వెళ్లిన సమయంలో ఆడుకుంటున్న తన ఇద్దరు పిల్లల్లో చిన్నవాడైన యష్ ఇంటి ముంగట ఉన్న నల్లకుండీలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో ఆలస్యంగా గమనించిన మృతుని అన్న తల్లికి తెలపడంతో వెంటనే స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లినట్టు సమాచారం. కానీ అప్పటికే యష్ చనిపోయినట్టు వైద్యులు ధృవీకరించడంతో కుటుంబమంతా బోరున విలపించారు.

అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఎన్నిక



నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-పిట్లం

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఎన్నిక మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించారు. మండల గౌరవ అధ్యక్షులుగా పాముగాని పామయ్య తిమ్మానగర్, అధ్యక్షులుగా గైని రాజు (పిట్లం), ప్రధాన కార్యదర్శిగా బక్క జ్యోతి రాజ్ (పిట్లం), ఉపాధ్యక్షులుగా జక్కపురం సుమన్ (కుర్తి), బాల గంగారం (బండాపల్లి), మీసాల రాజు (చిన్న కొడగల్), గంగారాం (పారడ్ పల్లి), కోశాధికారిగా గైని నాగయ్య (అల్లాపూర్), ఆర్గనైజర్ సెక్రెటరీగా విజయ్ (కొడప్‌గల్), సహాయ కార్యదర్శిగా మారుతి (గౌరారం), అడ్వైజర్‌గా మహేందర్ , దుర్గయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి సంఘ అభివృద్ధి తో పాటు అంబేద్కర్ సమాజాభివృద్ధికి తోడ్పాటునందిస్తామని అన్నారు. అనంతరం డివిజన్ కమిటీ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి గైని సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైసయ్య, ఎస్సీ కులాల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గంగారాం, ప్రధాన కార్యదర్శి సాయిలు , జిల్లా , డివిజన్ గౌరవాధ్యక్షులు గైని పోచయ్య , విట్టల్ , నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మలు కొట్టారు.. రోడ్డుపై వదిలేశారు

- రోడ్డుపై ప్రమాదకరంగా మారిన చెట్టు కొమ్మలు
- ప్రమాదాలు జరగకముందే తొలగించాలని వాహనదారుల డిమాండ్



రోడ్డుపై పడి ఉన్న కొమ్మలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలం లోని మద్దికుంట మర్రి నుండి రెడ్డి పేట వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు వెంట వెళ్లి 33 కె.వి విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను గత నాలుగు ఐదు రోజుల క్రితం తొలగించి, రోడ్డుపైనే పడేయడంతో వాహనదారులకు ప్రమాదక రంగా మారాయి. ఈ రోడ్డు వెంట మాచారెడ్డి, సిరికొండ, భీంగల్ మండల కేంద్రాలతో పాటు కామారెడ్డి జిల్లా కేంద్రానికి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి రద్దీ ఉన్న రోడ్‌లో చెట్ల కొమ్మలు తొలగించి రోడ్డుపై వదిలేయడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అలాంటి సంఘటనలు జరగకముందే అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించాలని వాహనదారులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణంలో సర్పంచ్ బొల్లు లావణ్య అధ్యక్షతన మండల కేంద్రంలోని 18 కుల సంఘాల ఆధ్వర్యంలో మత్తడి పోచమ్మ నూతన ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మత్తడి పోచమ్మ ఆలయ కమిటీ నూతన అధ్యక్షునిగా బొల్లారం సాయిలును 18 కుల సంఘాల అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చుప్పాల సాయిలు, చేపురు పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా దురిశెట్టి అశోక్, కోశాధికారిగా మంద కృష్ణయ్య, కార్యదర్శిగా కౌడా శ్రీను, ఆలయ కమిటీ సలహాదారులుగా ముదాం సాయిలు, కమ్మరి వెంకటేశం, పారిపల్లి సురేష్, కుమ్మరి ప్రభాకర్, శెట్టిపల్లి సత్యం, బెస్త బాలయ్యను, అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా 18 కుల సంఘాల అధ్యక్షులను ఎన్నుకున్నట్టు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్‌లో స్థానిక శిశుమందిర్ ప్రారంభమై 29 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థులు, ఆచార్యుల సమ్మేళనం శిశు మందిర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హరిస్మరన్ రెడ్డి, సభాధ్యక్షులుగా కొత్త దుర్గయ్య, పక్కి శ్రీనివాస్ శైక్షనిక్ ప్రముఖ్, రాజిరెడ్డి జిల్లా కార్యదర్శి, సత్య ప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షులు పూర్వ ప్రధానాచార్యులు బాల్ రెడ్డి పాల్గొన్నారు. సందర్బంగా హరిస్మరణ్ రెడ్డి మాట్లాడుతూ శిశు మందిర్ విధ్యాపీఠం ద్వారా సేవ మార్గం లో లక్షలాది విద్యార్థులకు దేశభక్తి, ధర్మం, సమాజ హితం, కుటుంబ ప్రభోదన గురించి బోధిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ప్రతి ఉపాధ్యాయులు కృషి చేస్తారని అలాగే స్థానిక శిశుమందిర్ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అనంతరం పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏం పని చేస్తున్నారో వేదిక మీద వివరించారు.

ఉపాధ్యాయులు ఆచార్యులు బాల్‌రెడ్డి దంపతులకు శాలువాకప్పిఘనంగా సన్మానించారు అలాగే పాఠశాల పనిచేసిన వంటి ఆచార్యులకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రణయ్, శశి ప్రీతంలు నిర్వహణ ఏర్పాట్లు చేయగా.. వంశీ, మహారాజుల భగత్, అశోక్, రవి కిషోర్, మెహర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో రూ. 70 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఎంపీపీ లోలపు గౌతమి, సర్పంచ్ గడ్డం స్వామి ఆదివారం ప్రారంభిం చారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కమ్మర్ పల్లి గ్రామానికి రూ.70 లక్షల నిధులు సిసి రోడ్ల కోసం మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ హుస్సేన్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు చింత గణేష్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్, సొసైటీ డైరెక్టర్లు మహేందర్, హరీష్, బీఆర్ఎస్ నాయకులు సైదు నర్సయ్య, కోరే నరసయ్య రాజన్న, బీఆర్ఎస్ గ్రామ యూత్ అధ్యక్షులు అక్షయ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు



నవతెలంగాణ-ధర్పల్లి
నిజామాబాద్ ఎంఎల్‌సీ కల్వకుంట్ల కవితపై అసభ్యకరంగా, వ్యతిరేకంగా మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ రూరల్ నియోజక వర్గ భారత జాగృతి కన్వీనర్ మల్లెల సాయి చరణ్ ఆదివారం ధర్పల్లి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రూరల్ విద్యార్థి కన్వీనర్ రామ్ , యూత్ కో కన్వీనర్ విక్కీ, మండల్ కన్వీనర్ గంగాదాస్ తది తరులు పాల్గొన్నారు.

బైక్, ఎక్సెల్ ఢీ ఒకరు మృతి



నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని బొంకన్‌పల్లి గ్రామ శివారులో బైక్, ఎక్సెల్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన భూమన్న(55) చికెన్ కోసం మాదాపూర్‌కు తన ఎక్సెల్ తీసుకొని వెళ్తున్నాడు. గ్రామ శివారులో బైక్ పై అజిత్ అనే వ్యక్తి అతి వేగంగా వచ్చి ఎక్సెల్ ను ఢీ కొన్నాడు. ఎక్సెల్‌పై ఉన్న భూమన్న అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న అజిత్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జనచైతన్య యాత్రను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం)
- పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/బోధన్/వర్ని
బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) చేపట్టిన జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఏరియా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు.. పట్టణంలోని శాస్త్రి నగర్‌లోగల డివిజన్ కార్యాలయం లో జనచైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పార్టీ అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 2023 మార్చి 17 నుండి 29 వరకు జన చైతన్య యాత్రలు జరుగుతున్నాయని తెలిపారు. దానిలో భాగంగా మార్చి 24న నిజామాబాద్ జిల్లాకేంద్రంలో జన చైతన్య యాత్ర ఉంటుందన్నారు. నిజామాబాద్ పట్టణంలోని పాత కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని అన్నారు. ప్రజలు, ప్రజాసానికవాదులు, లౌకికవాదులు, మేధావులు భాగస్వాములు కావాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ విధానాలతో మోడీ అమీతీషా నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు కట్టబెడుతూ ప్రజలపై భారాలను మోపుతూ 23 కోట్ల మందిని పేదలుగా చేశారని అన్నారు. దేశమంటే అంబానీ ఆదానిల సొత్తుగా మార్చేశారని, నూనెలు, గ్యాస్ పెట్రోల్ డీజిల్‌తోసహా అన్ని రకాల సరుకుల ధరలు రెండు మూడు రెట్లు పెంచారన్నారు. 2014లో 410 రూపాయలు ఉన్న గ్యాస్ ధర 1150 రూపాయలకు పెరిగిందని తెలిపారు. ఈ ధరల పెరుగుదల వల్ల కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయలు లాభాలను పోగేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేట్ కంపెనీలకు, కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని గద్దెనెక్కిన బిజెపి ఉన్న ఉద్యోగాలను పీకేస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల శాతం పెరుగుతుందని, ప్రజాస్వామ్య హక్కులను కూడా హరించేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంటుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వ పాలనపై విమర్శలు చేసిన మీడియా, ప్రజాస్వామ్యవాదుల పైన కూడా తీవ్రమైన దాడులను తెగబడుచున్నది అన్నారు. బీజేపీని గద్దె దించేంతవరకు అందరూ కలిసి పోరాటం చేయాలని, హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదామని, సామాజిక తరగతులపై కేంద్ర ప్రభుత్వ దాడిని ఎండగడదామని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజాస్వామ్యవాదులందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఏరియా కమిటీ సభ్యులు కుతాడి ఎల్లయ్య, సిద్ధ నాగరాజు, తోకట్టి భూమేశ్వర్, పుల్దీప్ శర్మ, గంగాధర్, జోహార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్: సిపిఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు గంగాధరప్ప కోరారు. ఆదివారం బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలో జనచైతన్య యాత్ర పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని, దేశంలో మతం, కులం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజా సమస్యలను విస్మరిస్తున్నారని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు కొనసాగిస్తూ పెట్టుబడుదారులకు దోచి పెడుతూ, ప్రజలను దగా చేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నా



ఆర్మూర్: జనచైతన్యయాత్ర పోస్టర్లు ఆవిష్కరించిన నాయకులు

రన్నారు. దీనికి వ్యతిరేకంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో మూడు జాతాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈనెల 24న నిజామాబాద్ జిల్లాలో బస్సు జాత ప్రారంభమవుతుందని, ఈ జాతకు సిపిఎం పార్టీ కేంద్ర పోలిట్ బ్యూరో సభ్యులు విజయ రాఘవన్, పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, టి. సాగర్, చుక్క రాములు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ ఆఫీస్ వద్ద ఉదయం 10 గంటలకు బహిరంగ సభ అనంతరం కామారెడ్డి జిల్లా గాంధారి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు , రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేద ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.గంగాధర్ , కార్యకర్తలు శశికళ, రాజేశ్వరి, యమునా, రవిరాజా, మహేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వర్ని: జన చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం గంగాధర్ అధ్యక్షతన జరిగింది. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ఈనెల 24న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యులు విజయ రాఘవన్ హాజరవుతున్నారని తెలిపారు. యాత్రలో రాష్ట్ర నాయకులు జాన్ వెస్లీ, వీరయ్య, సాగర్, వెంకట్రాములు, రమ ఉంటారన్నారు.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందన్నారు. జన్ ధన్ పేరుతో ప్రజల ఖాతాల్లో 15 లక్షలు వేస్తామని కుచ్చుటోపి పెట్టిందని మండిపడ్డారు. మతం పేరు చెప్పి యువతను పక్కదారి పట్టిస్తూ, ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటుందని నిప్పులు చెరిగారు. యువత బీజేపీ ఉచ్చులో పడొద్దని కోరారు. సమావేశంలో సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, నాయకులు గంగాధర్, మహమ్మద్ ఖాన్, నాగనాథ్, గాయత్రి, లక్ష్మి సాయిబాబు, సత్యనారాయణ, సావిత్రి, సాగర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



వర్ని :మాట్లాడుతున్న శంకర్‌గౌడ్



బోధన్ : జనచైతన్యయాత్ర పోస్టర్లు ఆవిష్కరించిన నాయకులు

దేగాం హెల్త్ సూపర్వైజర్ అర్గుల్ సుభాష్ మృతి



నవతెలంగాణ-ఆర్మూర్
ఆలూర్ మండలంలోని దేగాం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న అర్గుల్ సుభాష్ శనివారం రాత్రి మృతి చెందారు. ఈయనకు బ్రెయిన్ లో నీరు రావడంతో అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించినా పరిస్థితి విషమించి మృతిచెందారు. జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ స్వగ్రామం కాగా జిల్లా కేంద్రంలో ఉంటున్నారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు..

.... పలువురు సంతాపం..
హెల్త్ సూపర్వైజర్ సుభాష్ మృతి పట్ల డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ రమేష్, పట్టణ ఆస్పత్రి సూపరెంటెంట్ నాగరాజు, హెల్త్ సూపర్వైజర్ చంద్రశేఖర్ జక్కుల మోహన్, బాలరాజ్ ఆశ, సిరి, గౌతమి గంగ, రిషిత్ ఆసుపత్రిల వైద్యులు రాకేష్ కుమార్, శేఖర్ రెడ్డి, లింగారెడ్డి, రమేష్ రెడ్డి, అమృత్ రాంరెడ్డి, వెంకట్ గౌడ్ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ముగిసిన ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న దిల్‌రాజు దంపతులు, తదితరులు

నవతెలంగాణ-మోపాల్
మండలంలోని ఇందూరు తిరుమలలో ఏడు రోజుల పాటు ఎంతో వేడుకగా జరిగిన బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. 108 కళశాల్లో గంగనీటితో అభిషేకం చేసి బ్రహ్మోత్సవాలను ముగించారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి త్రిదండి దేవానాథ జీయరు స్వామి పర్యవేక్షణలో ఆచార్య గంగోత్రి రామానుజ దాస్ స్వామి ఆశీస్సులతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం అయ్యాయని ఆలయ ధర్మకర్త నరసింహ రెడ్డి అన్నారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి దంపతులు, దిల్ రాజు దంపతులు, విజయసింహారెడ్డి దంపతులు, సర్పంచ్ సాయరెడ్డి, ఎంపీటీసీ రాములు, ఫోటో గంగాధర్, రవీందర్ యాదవ్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, రమేష్, భాస్కర్, లక్ష్మి, రాజేశ్వర్, మురళి, అరుణ్, అరవింద్, భూం రెడ్డి, చిన్నయ్య, ఎర్రోళ్ల సాయిలు, యాజ్ఞాచార్యులు లక్ష్మణాచార్యులు, సంపత్ కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు, విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన సాఫ్ట్‌బాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ దుర్గారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో గుజరాతి గంగారాం స్మారక నిజామాబాద్ జిల్లా మినీ జూనియర్ (అండర్ -12) సాఫ్ట్ బాల్ క్రీడలను ప్రిన్సిపల్ దుర్గా రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండే క్రీడల్లో పాల్గొనడంవల్ల శారీరకంగా. మానసికంగా అభివృద్ధి చెందడంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ పోటీలలో పాల్గొనడానికి మా వంతు కృషి చేస్తామన్నారు. ఈ టోర్నీలో బాలికలు 8 జట్లు బాలురు 8 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, ప్రముఖ వ్యాపారవేత్త గుజరాతి సురేష్, సీనియర్ సాఫ్ట్ బాల్ క్రీడాకారిణి గుజరాతి సౌమ్య, గుజరాతి ఆకాష్, సాఫ్ట్‌బాల్ సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, బానోత్ విట్టల్, జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె నరేంద్ర చారి, వ్యాయామ ఉపాధ్యాయులు, సాఫ్ట్ బాల్ అకాడమీ కోచ్ లు నరేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

మాల మహానాడు



రాష్ట్రసదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఈనెల 25న రాష్ట్ర మాల మహానాడు ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సుని విజయవంతం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజ్, జిల్లా మాలమహానాడు అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లయ్య తెలిపారు. ఆదివారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర సదస్సు కరపత్రాలు, గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలని, దళిత బందులో అన్ని కులాల వారికి సమన్యాయం చేకూర్చాలని కోరారు. రాజ్యసభ శాసనమండలి ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలని, ఎస్సీ గురుకుల సంక్షేమ హాస్టళ్లకు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాంది వినయ్, టౌన్ అధ్యక్షులు ఎడ్ల ధనరాజ్, టౌన్ ప్రధాన కార్యదర్శి బట్టి గంగాధర్, నగర కోశాధికారి సిద్ధం రాజేందర్, డివిజన్ అధ్యక్షులు తలారి సాయన్న, జిల్లా మహిళ అధ్యక్షురాలు మాధవి, టౌన్, డివిజన్, కార్యవర్గ సభ్యులు బత్తుల కిష్టయ్య, ఆసది గంగాధర్, టీవీ నారాయణ, చంద్రమోహన్, వెంకటరమణ, విజయ్ సోలంకి, రామ్ చందర్, దయానంద్ సోలంకి, బాల్ రాజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బిడ్జి ఏర్పాటు చేయాలి

- ఘనపూర్ గ్రామస్తుల ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఘన్‌పూర్ గ్రామస్తులు ఆదివారం డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌కు తరలివచ్చారు. ఘనపూర్ నుండి డిచ్ పల్లి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ గా వెళ్లి నినాదాలు చేసి రైల్వే మేనేజర్‌కు సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకుడు సాయినాథ మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే వారందరూ బస్సు దిగి ఇదే మార్గం గుండా స్టేషన్ నుండి కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. ప్రజలు నిజామాబాద్‌కు వెళ్లాలన్న ఇక్కడి నుండి వెళ్ళాలని, అప్పుడప్పుడు ఇక్కడ గూడ్స్ రైళ్లు ఆగిన్నపుడు దాని కింద నుండి వెళితే చాలా సార్లు చాలా మందికి గాయాలు అయ్యాయన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. కొన్ని సంవత్సరాల నుండి ఫుట్ ఓవర్ బిడ్జి కావాలని అడుగుతూనే ఉన్నామన్నారు. ప్రస్తుతం కరెంట్‌తో నడిచే మార్గం పనులు పూర్తి కావడానికి వచ్చాయని, ఖచ్చితంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి కావాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎంపి ధర్మాపూరి అరవింద్ దయ తలచి వీలైనంత తొందరగా ఫుట్ ఓవర్ బిడ్జి మంజూరు చేయాలనీ విన్నవించుకున్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, ఘనపూర్ గ్రామాభివృధి కమిటీ సభ్యులు భూమయ్య, రాజు, మహేష్, ముత్తన్న సాయిలు, దేవయ్య, గంగారాం, కిషన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న రోబోటిక్ ప్రదర్శనలు



విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాకతీయ విద్యాసంస్థలకు చెందిన కాకతీయ ఓలంపియాడ్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్ ప్రదర్శనలు రెండో రోజు ఆదివారం నిర్వహించారు. కాకతీయ ఓలంపియాడ్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సుమారు మూడు వందలకు పైగా ప్రయోగాలు తయారు చేయడం పట్ల వారి తల్లితండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా ప్రాజెక్టు తయారు చేయడం అందరిని ఆలోచింపచేశాయి. కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్లు రజనీకాంత్, రామోజీరావు, తేజస్విని, ప్రిన్సిపాల్ గిరిధర్, నటరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇండ్లను అందజేసిన ఘనత బీఆర్ఎస్‌దే

- కాంగ్రెస్ హయంలో కాగితాలకే పరిమితం
- ప్రజల సొమ్మును కార్పోరేట్లకు ధారాదత్తం చేస్తున్న మోడీ
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- బడా భీంగల్‌లో లబ్దిదారులకు డబుల్ ఇండ్ల పత్రాల పంపిణీ



ఇండ్ల పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్
తెలంగాణ రాష్ట్ర సర్కారు ఇండ్లులేని వారికోసం ప్రవేశపెట్టిన డబుల్ బెడ్‌రూంల పథకంలో అబ్దిదారులను గుర్తించి పారదర్శంకంగా అందజేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకు దక్కుతుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బడాభీంగల్ గ్రామంలో నిర్మించిన డబుల్ ఇండ్లను ఆదివారం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఇండ్లులేని వారికి ఇంటిని నిర్మించి ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ చేపట్టిన ఈ బృహత్తర పథకం నిరంతర ప్రక్రియ అని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాలలో 1500 ఇండ్లను నిర్మించామని ఇందులో బాగంగానే బడా భీంగల్‌లో 7కోట్ల 76 లక్షలతో 112 ఇండ్లను నిర్మించామని తెలిపారు. వీటిని ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనతో ఇండ్లులేని వారి గుర్తించి పారదర్శంకంగా అందిస్తున్నామన్నారు. ఇందుకు బడా బీంగల్ బీఆర్ఎస్ నాయకులు సహకారం కూడ మరువలేనిదని కొనియాడారు.

స్థలం ఉన్నవారికి రూ.3లక్షలు

అలాగే ఇండ్లులేని వారు నిరుత్సాహపడకూడదన్నారు. ఇతర పార్టీల నాయకులు రెచ్చగొట్టే ప్రయత్నం కూడ చేస్తారని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో మరో 3 వేల మంది స్థలం ఉండి ఇళ్ల లేనివారికి ప్రభుత్వం 3 లక్షల రూపాయలను అందించనుందని తెలిపారు. దీనిని గమనించాలని ప్రజలకు తెలిపారు.

ప్రజాధనాన్ని లూటీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే..

తెలంగాణ రాష్ట్ర అభివృద్దిని చూసి ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇండ్ల పేరిట లబ్దిదారులకు రావాల్సిన డబ్బులను కాంగ్రెస్ నాయకుల జేబుల్లో నింపుకున్నారన్నారు. అప్పుడు ఒక్కో ఇంటికి 75 వేల రూపాయలు ఇస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం 10 లక్షలతో ఇంటిని నిర్మించి ఇస్తుందన్నారు. కేసీఆర్ కట్టించిన ఒక్క ఇళ్లుకాంగ్రెస్ కట్టించిన 10 ఇండ్లతో సమానమని తెలిపారు.

కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం

మోడీ ప్రభుత్వం ప్రజాదనాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తు బ్యాంకులను లూటీ చేస్తుందన్నారు. ఇందలో భాంగంగానే ఆదానీ, అంబానీ లాంటి వాళ్ల 12వేల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేస్తు వారికి కొమ్ము కాస్తున్నారన్నారు. 60 వేల కోట్లు ఎల్ఐసి, 70 వేల కోట్లు ఎస్‌బిఐనుంచి లూటీ చేశారని వీటితోనే ఎంఎల్ఏలను కొనేపని పెట్టుకొన్నారన్నారు. దీనిని ప్రశ్నించిన కేసీఆర్‌కు సమాధానం ఇవ్వకుండ ఆయన కూతురు కవితమ్మపై లేనిపోని కేసులతో ఇరాకాటంలో పెట్టిలని చూడడం సరికాదన్నారు. వీటివల్లనే నిత్యవసర పరుకుల ధరలు పెరుగుతున్నాయని దీనిని ప్రజలు గమనించాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో నిర్మించి ఇస్తున్న డబుల్ ఇండ్లమాదిరిగ బిజెపి పాలిత రాష్ట్రలలో ఒక్కటైనా చూయిస్తే రాజీనామా చేస్తానని మంత్రి సవాల్ విసిరారు. పసుపు బోర్డు తెస్తానని, పసుపుకు మద్దతు ధర ఇప్పిస్తానని బాండు పేపర్ రాసి ఇచ్చిన అరవింద్ బాండ్‌పేపర్ విలువ తీశారన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సింహాచలం (డీసీఓ), ఆర్‌డిఓ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీధర్‌కుమార్, జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, సర్పంచ్ సంజీవ్, యంపిటీసి బావాయి, ఏయంసీ చైర్మన్ గుణ్‌వీర్‌రెడ్డి,జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మోయిజ్, పార్టీ గ్రామశాఖనాయకులు రాగుల మోహన్, కిషన్, శంకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

- ఏప్రిల్ 5వరకు నిర్వహణ
- మేయర్ దండు నీతుకిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్
సీడీఎంఏ ఆదేశానుసారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛోత్సవం 2023 పోస్టర్‌ను పురపాలక సంఘ కార్యాలయంలో మేయర్ దండు నీతూకిరణ్ శేఖర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 30 వరకు జరిగే స్వచ్ఛోత్సవం క్యాంపెయిన్‌లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో పారిశుధ్య ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టిన మహిళలకు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులతో సత్కరిస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 5 వరకు మహిళా సంఘాలు, చిన్నతరహా మహిళ ఎంటర్ప్రైజెస్, స్టార్టాప్స్, ఎన్జీవోస్ నుంచి పురపాలక సంఘ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. కమ్యూనిటి, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సర్వీసెస్, యూసెజ్ వాటర్ ట్రీట్మెంట్, చెత్త సేకరణ, రవాణా, డిఆర్సి సెంటర్ల నిర్వహణ, చెత్త ద్వారా అద్భుత కళా కృతులు, ఘన వ్యర్థాల నిర్వ హణ అవగాహన ట్రెనింగ్, టెక్నాలజీ ఇన్నో వేషన్‌పై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు జూన్ 5 పర్యావరణ దోనోత్సవాన్ని పురస్కరించుకొని నగర, రాష్ట్ర, దేశస్థాయి అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. స్వచ్చత యాత్ర పేరిట నిజామాబాద్ నగర వ్యాప్తంగా ఈ నెల 29న ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేటగిరీల వారిగా మహిళలు సంబంధిత విభాగాలకు దరఖాస్తు చేసుకోవాలని లేకపోతే https://sbmurban. org/wins-awards-2023 ఈ లింకు ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పురపాలక సంస్థకు చెందిన టియంసి శోభదేవి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛోత్సవం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మేయర్, మెప్మాసిబ్బంది